క్లుప్తంగా

6న మెట్టుగుట్టపై షాపులకు వేలం

మడికొండ: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా తొమ్మిది రోజుల పాటు జరగనున్న నవరాత్రోత్సవాల సందర్భంగా మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయంపై షాపుల నిర్వహణకు ఫిబ్రవరి 6వ తేదీన ఉదయం దేవాదాయ శాఖ అధికారులు, ధర్మకర్తల మండలి సమక్షంలో వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కే.శేషుభారతి ఒక ప్రకటనలో తెలిపారు. లడ్డూ, పులిహోర, కొబ్బరి కాయలు అమ్ముకునే హక్కు, కొబ్బరి చిప్పలు పోగుచేసుకోవడం, అభిషేకం, పంచామృతాలు అమ్ముకోవడం, చెరుకు బండి నిర్వహణ, వాహనాల పార్కింగ్ కోసం వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఎంజీఎం సూపరింటెండెంట్‌కు శుభాకాంక్షలు



ఎంజీఎం: ఎంజీఎం సూపరింటెండెంట్‌గా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కిశోర్‌ను టీఎన్జీవోస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ ఇస్మాయిల్ అలీ, లక్ష్మీప్రసాద్, రవికుమార్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్యోద్యమ అమరులకు ఘన నివాళి



కేయూ క్యాంపస్: స్వాతంత్ర్య ఉద్యమ అమరుల సంస్మరణ దినం సందర్భంగా అసువులు బాసిన అమరులకు కాకతీయ యూనివర్సిటీ పరిపాలన భవనం వద్ద గురువారం నివాళులర్పించారు. కార్యక్రమంలో వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి, యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌లాల్, ఫార్మసీ కళాశాల డీన్ గాదె సమ్మయ్య, డాక్టర్ చిర్ర రాజు, డాక్టర్ నాగరాజు, ఉద్యోగులు పాల్గొన్నారు.

'సన్మార్గం- సత్ప్రవర్తన'పై శిక్షణ



హన్మకొండ చౌరస్తా: వేసవి సెలవుల్లో పిల్లలకు సన్మార్గం - సత్ప్రవర్తన' అనే అంశంపై శిక్షణ ఇవ్వనున్నట్లు శిక్షణాలయ ప్రధాన పర్యవేక్షకులు కుసుమ శ్రీనివాస్, కొలనుపాక సుమన్‌శాస్త్రి తెలిపారు. హనుమకొండ రెడ్డికాలనీలోని ప్రోగ్రెస్ హైస్కూల్ సమీపంలోని శిక్షణ వేదిక మందిరంలో పర్యవేక్షకులు గురువారం వివరాలు వెల్లడించారు. 10 నుంచి 14 ఏళ్ల వయస్సు గల అబ్బాయిలకు మాత్రమే శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాల కోసం 98492 67993, 99084 43451 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణకు రాజకీయ పార్టీల మద్దతు

హసన్‌పర్తి: ఎస్సీ వర్గీకరణకు వివిధ రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించాయని ఎమ్మార్పీఎస్ నాయకులు తెలిపారు. ఫిబ్రవరి 7న జరగనున్న వేల గొంతుకలు.. లక్షల డప్పుల బహిరంగ సభను విజయవంతం కోరుతూ కిట్స్ క్రాస్‌లోని బాలాజీ గార్డెన్‌లో హసన్‌పర్తి మండలంలోని వివిధ రాజకీయ పార్టీలతో సన్నాహక సమావేశాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు పుట్ట రవిమాదిగ, బొట్ల భిక్షపతి మాదిగ, రాజారపు భిక్షపతి, బోడ యుగంధర్, స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, మాజీ ఎంపీటీ పిట్టల కుమారస్వామి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్‌రావు, గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరిగౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కాజీపేటను అభివృద్ధి చేయాలి



కాజీపేట: నూతనంగా ఏర్పడిన కాజీపేట మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సీపీఎం నాయకుడు ఎం.చుక్కయ్య కోరారు. కాజీపేట మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్ జూనియర్ కళాశాల మంజూరు చేయాలని, 30 పడకల ఆస్పత్రి నిర్మించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య, జంపాల రమేష్, మదన్‌చారి పాల్గొన్నారు.

భగీరథ నీళ్ల కోసం నిరీక్షణ

- ఎనిమిదేళ్లుగా చుక్క నీరు లేదు
- పైపులు వేసి.. నీటి సరఫరా మరిచారు
- సుభాష్‌నగర్‌లో తలెత్తిన నీటి ఎద్దడి



నీళ్ల కోసం ఖాళీ బిందెలతో మహిళలు



మిషన్ భగీరథ పైపులైన్

హసన్‌పర్తి: 65వ డివిజన్ సుభాష్‌నగర్ వాసులు భగీరథ నీళ్ల కోసం నిరీక్షిస్తున్నారు. మిషన్ భగీరథ పథకం ప్రారంభమై ఎనిమిదేళ్లు అవుతున్నా ఆ కాలనీలో చుక్క నీరు కూడా రాలేదని స్థానికులు చెబుతున్నారు. సుభాష్ నగర్‌లో 151 ఇళ్లు ఉన్నాయి. మిషన్ భగీరథ పథకంలో భాగంగా పైపులైన్ ఏర్పాటు చేశారు. అన్ని ఇళ్లకు పైపులైన్ నుంచి నల్లా కనెక్షన్ కూడా ఇచ్చారు. ఆ తర్వాత నీటి సరఫరాను అధికారులు మరిచిపోయారు.

కాగితాలకే పరిమితం

సుభాష్‌నగర్‌కు మిషన్ భగీరథ నీరు సరఫరా చేస్తున్నట్లు అధికారులు కాగితాలకే పరిమితం చేశారు. చివరి ఇంటి వరకూ నీళ్లు ఇస్తున్నామని ప్రకటించిన అధికారుల మాటలు గాలికే పరిమితమయ్యాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే సుభాష్‌నగర్‌కు నీళ్లు రావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఇప్పటికీ బావి నీళ్లే దిక్కు

సుభాష్‌నగర్ కాలనీవాసులు ఇప్పటికీ మిషన్ భగీరథ నీళ్లు ఎరుగలేదు. ఈక్రమంలో స్థానికంగా ఉన్న బావి నీళ్లు సరఫరా చేసుకుంటూ వచ్చారు. ప్రస్తుతం మోటారు కాలిపోవడంతో నీటి సమస్య ఉత్పన్నమైంది. గత కొద్దిరోజులుగా నీరు రాకపోవడంతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. సమీపంలోని వ్యవసాయ బావుల వద్దకు నీళ్ల కోసం పరుగులు తీస్తున్నారు.

శుద్ధమైన నీరు ఇస్తామన్నారు



కాలనీకి శుద్ధమైన నీరు సరఫరా చేస్తామని అధికారులు చెప్పారు. నల్లాలు ఏర్పాటు చేసి నీళ్లు ఇవ్వడం మాత్రం మరిచిపోయినట్లున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మిషన్ భగీరథ నీరు వచ్చేలా చూడాలి.

- జన్ను శిరీష

దళిత కాలనీపై చిన్నచూపు



దళిత కాలనీపై పాలకులు చిన్నచూపు చూస్తున్నారు. కార్పొరేషన్‌లో ఉన్నప్పటికీ బోరునీరే తాగుతున్నాం. మోటారు కాలిపోవడంతో బావి నీరు కూడా నిలిచిపోయింది. దాంతో నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

- నద్దునూరి శ్రావణి

సాంకేతిక సమస్యతో..

సాంకేతిక సమస్య వల్ల నీరు అందించలేకపోతున్నాం. మరో ప్రాంతం నుంచి కనెక్షన్ ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నాం. ప్రసుతం బావినుంచి నీరు అందిస్తున్నాం.

- సతీష్‌కుమార్, ఏఈ

బీసీలు రాజకీయాలను శాసించాలి

- పద్మశాలి సంఘం నేత ఈగ మల్లేశం



నయీంనగర్: మాట్లాడుతున్న ఈగ మల్లేశం

నయీంనగర్: బీసీలు రాజకీయాలను శాసించి రాజ్యాధికారాన్ని చేపట్టాలని అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ పూర్వ అధ్యక్షుడు ఈగ మల్లేశం పిలుపునిచ్చారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆధిపత్య కులాల పాలకులు బీసీలను ఆర్థికంగా, రాజకీయంగా అణగదొక్కడానికే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తెచ్చి తీరని అన్యాయం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు.

నయీంనగర్: ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో జమాతే ఇస్లామీ హింద్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎండీ.అబ్దుల్ హన్నన్ మాట్లాడుతూ రాజకీయ వ్యవస్థలో వెనుకబడిన కులాలకు ప్రాతినిధ్యం ఉండాలన్నారు.

నయీంనగర్: వడ్డెర కులస్తులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని వడ్డెర సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుంజ స్వామి డిమాండ్ చేశారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 2న జరగనున్న బీసీ రాజకీయ యుద్ధభేరి సభకు తరలిరావాలని పిలుపునిచ్చారు.

హన్మకొండ: బీసీల రాజకీయ యుద్ధభేరి మహాసభను విజయవంతం చేయాలని కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజు యాదవ్ పిలుపునిచ్చారు. హనుమకొండ సుబేదారిలోని వరంగల్ క్లబ్‌లో బీసీ డాక్టర్స్ ఫోరం ఆధ్వర్యంలో యుద్ధభేరి సన్నాహక సమావేశం గురువారం జరిగింది.

హన్మకొండ చౌరస్తా: వచ్చే నెల 2వ తేదీన హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో జరగనున్న బీసీల రాజకీయ యుద్ధభేరి సభకు ముదిరాజ్‌లు అధిక సంఖ్యలో తరలిరావాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యదర్శి పులి రజనీకాంత్ పిలుపునిచ్చారు. ఈమేరకు 10వ డివిజన్ మచిలీబజార్‌లోని మహాసభ కార్యాలయంలో సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

మడికొండ: బీసీ రాజకీయ యుద్ధభేరి సభను విజయవంతం చేయాలని కోరుతూ ఖిలాశాపురంలో ఈనెల 12వ తేదీన ప్రారంభమైన సైకిల్ యాత్ర గురువారం మడికొండకు చేరుకుంది. ఈమేరకు యాత్రకు రజక సంఘం మాజీ అధ్యక్షుడు గంగారపు వీరేష్ స్వాగతం పలికారు.

కాళ్మొక్కుతాం.. డంపింగ్ యార్డును తొలగించండి



డంపింగ్ యార్డు వద్ద నిరసన తెలుపుతున్న బాధితులతో మాట్లాడుతున్న అధికారులు

మడికొండ: 'మీ కాళ్లు మొక్కుతాం మా గ్రామాల నుంచి డంపింగ్ యార్డును తొలగించండి' అని మున్సిపల్ అధికారులను డంపింగ్ యార్డు అడ్‌హక్ కమిటీ సభ్యులు, మడికొండ, రాంపూర్ గ్రామాల ప్రజలు వేడుకున్నారు. డంపింగ్ యార్డ్‌ను ఎత్తివేయాలని గ్రీవెన్ సెల్‌లో సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు డంపింగ్ యార్డును మున్సిపల్ అధికారులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అడ్‌హక్ కమిటీ సభ్యులు, మడికొండ, రాంపూర్ ప్రజలు అక్కడికి చేరుకుని నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ అధికారులు మాట్లాడుతూ మూడు నెలల్లో డంపింగ్ యార్డును మరో ప్రాంతానికి తరలిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ రాజారెడ్డి, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, ఆస్కి సంస్థ ప్రతినిధి రాజమోహన్ రెడ్డి, అడ్‌హక్ కమిటీ సభ్యులు రాంగోపాల్‌రావు, దువ్వ నవీన్, కరుణాకర్‌రెడ్డి, వెంకట్‌రావు, కొంరయ్య, బొల్లికొండ వినోద్, గడ్డం మహేందర్, మినుగు సతీష్, 46వ డివిజన్ కార్పొరేటర్ మునిగాల సరోజన, పిట్టల రమేష్, బోగి మహేందర్ పాల్గొన్నారు.

హక్కుల ప్రకారం జీవనం సాగిస్తున్నాం



ఖిలా వరంగల్: భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాల పరిధిలోనే జీవనం సాగిస్తున్నామని, హింస, అల్లర్లకు తావులేకుండా అమీర్ జమాత్ ఉల్ ముస్లిమీన్ హిందీ సంస్థకు అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నానని మహ్మద్ జక్రియా తెలిపారు. పాకిస్తాన్ ఉగ్రవాదులతో తనకు సంబంధాలు అంటగట్టి తన కుటుంబాన్ని రోడ్డుపాలు చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై శ్రీకాంత్‌ను గురువారం కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఎవరూ అరెస్ట్ చేయలేదని, పాస్‌పోర్ట్‌ను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులు వదిలేశారని వివరించారు.

420 హామీలను అమలెప్పుడు చేస్తారు?



విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్

హన్మకొండ చౌరస్తా: కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చి 420 రోజులు గడిచాయని, ఇంకా ఎప్పుడు అమలు చేస్తారో ప్రజలకు చెప్పాలని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ప్రశ్నించారు. మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఏడాది పాలన కోతలు, ఎగవేతలు, ఎదురుచూపుల పాలన అవుతుందని ఎద్దేవా చేశారు.

ప్రజలను మోసం చేసిన ప్రభుత్వం

కేయూ క్యాంపస్: ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బీఆర్ఎస్వీ కాకతీయ యూనివర్సిటీ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ అన్నారు. ఈమేరకు మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని హనుమకొండ యూనివర్సిటీ వందఫీట్ల రోడ్డులోని టీవీ టవర్‌కాలనీలోని మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్‌చంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంజర్ల మనోజ్‌కుమార్, జిల్లా కోఆర్డినేటర్ అరూరి రంజిత్, బీఆర్ఎస్వీ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ జెట్టి రాజేందర్, బాధ్యుడు లంక రాజగోపాల్ పాల్గొన్నారు.

అంకితభావం కలిగిన ప్రొఫెసర్ జ్యోతి



నివాళులర్పిస్తున్న వీసీ, ప్రొఫెసర్లు, తదితరులు

కేయూ క్యాంపస్: నిబద్ధత, అంకితభావం కలిగిన ప్రొఫెసర్ ఏటూరు జ్యోతి అని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి కొనియాడారు. కాకతీయ యూనివర్సిటీ తెలుగు విభాగంలోని సెమినార్ హాల్‌లో ఏటూరు జ్యోతి సంస్మరణ సభను గురువారం నిర్వహించారు. తొలుత జ్యోతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింతకింది కాశీం, కేయూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సురేష్‌లాల్, సోషల్ సైన్స్, ఆర్ట్స్ విభాగాల డీన్ ప్రొఫెసర్ మనోహర్, కేయూ పాలకమండలి సభ్యుడు డాక్టర్ చిర్ర రాజు, రిటైర్డ్ ప్రొఫెసర్ కాత్యాయనీ విద్మహే పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరించిన వీసీ



కేయూ క్యాంపస్: విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ రాజనీతిశాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ ప్రేమానందం రచించిన ఆర్టికల్ ఇన్ కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా అనే పుస్తకాన్ని కేయూలో వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ సంకినేని వెంకట్, బీఓఎస్ డాక్టర్ కృష్ణయ్య, రిటైర్డ్ ప్రొఫెసర్ సమ్మయ్యలాల్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమమే ఐజేయూ లక్ష్యం



డైరీని ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

నయీంనగర్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, జిల్లాలో జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ముందుకు సాగుతోందని హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి తెలిపారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో యూనియన్ డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు సాధించేందుకు కృషి చేస్తామని, అక్రిడిటేషన్లపై జరుగుతున్న దుష్ప్రచారాన్ని జర్నలిస్టులు నమ్మవద్దని కోరారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, యూనియన్ జాతీయ నాయకులు దాసరి కృష్ణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, హౌజింగ్ రాష్ట్ర కన్వీనర్ వల్లాల వెంకటరమణ, రాష్ట్ర నాయకులు కంకణాల సంతోష్, గడ్డం కేశవమూర్తి, పిన్న శివకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నిబద్ధతతో ప్రయాణికులకు సేవలందించాలి



ఉద్యోగులను సన్మానిస్తున్న మాధవ రావు, భానుకిరణ్, డిపో మేనేజర్లు, పర్సనల్ ఆఫీసర్

హన్మకొండ: ఆర్టీసీ ఉద్యోగులు ప్రజల హృదయాల్లో నిలిచేలా నిబద్ధతతో సేవలందించాలని ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్లు మాధవరావు, కేశరాజు భానుకిరణ్ అన్నారు. హనుమకొండ డిపో ఆర్టీసీ ఉద్యోగులు దోపతి రవీందర్ రెడ్డి, ఎం.బాబు పదవీ విరమణ అభినందన కార్యక్రమం గురువారం జరిగింది. ఈ డీఆర్ఎంలు వారు మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. సంస్థ పరిరక్షణకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్, వరంగల్ -1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు, పర్సనల్ ఆఫీసర్ అర్పిత, సూపర్‌వైజర్లు నాజియా సుల్తానా, వి.చంద్రశేఖర్, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీల ప్రొఫెసర్లకు ఉద్యోగ విరమణ వయస్సు పెంపు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని యూనివర్సిటీల్లోని ప్రొఫెసర్లకు ఉద్యోగ విరమణ వయస్సు 60 ఏళ్ల నుంచి 65 ఏళ్లకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈనెల 28వ తేదీతో ఉన్న జీఓ గురువారం రాత్రి వెలువడింది. దీంతో కాకతీయ యూనివర్సిటీలోని ప్రొఫెసర్లు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. కేయూ ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ నర్సింహారెడ్డి, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ఎంహెచ్‌ఆర్ఎం విభాగం ప్రొఫెసర్ యాదగిరిరావు ఈనెల 31న ఉద్యోగ విరమణ పొందనుండగా ఈ జీవోతో వారు మరో ఐదేళ్లపాటు ప్రొఫెసర్లుగా కొనసాగబోతున్నారు.

ఘనంగా 'ఒలింపియాడ్' వార్షికోత్సవం

కాజీపేట: సోమిడి గ్రామ శివారులోని తాళ్ల పద్మావతి ఒలింపియాడ్ పాఠశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. సంస్థ చైర్మన్ తాళ్ల మల్లేశం గురువారం జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలబాలికల ఆధ్వర్యంలో జరిగిన సాంస్కృతిక పోటీలు ఆకట్టుకున్నాయి.

మహాత్మాగాంధీకి ఘన నివాళి



కాశిబుగ్గ శివాలయం వద్ద గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని నగర వ్యాప్తంగా గురువారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- సాక్షి నెట్‌వర్క్



గాంధీజీ చిత్రపటానికి సెల్యూట్ చేస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝూ

సంక్షిప్తంగా

నిట్‌లో పుస్తక ప్రదర్శన

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లో గురువారం ఏర్పాటు చేసిన రెండు రోజుల బుక్ ఫేర్-25 పుస్తక ప్రదర్శనను నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలన్నారు. నిట్ సెంట్రల్ లైబ్రరీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పుస్తక ప్రదర్శనలో దేశవ్యాప్తంగా 17 మంది ప్రముఖ ప్రచురణకర్తలు, సరఫరాదారులు, విక్రేతలు భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. నిట్ లైబ్రేరియన్, ప్రొఫెసర్ శ్రీనివాసరావు, ప్రొఫెసర్లు ఆనంద్‌కిషోర్, ఇర్రన్న, బాలకృష్ణ పాల్గొన్నారు.

30హెచ్ఎంకేడీ 353:

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

కేయూ క్యాంపస్: దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని కాకతీయ యూనివర్సిటీ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కేయూ శాఖ ఆధ్వర్యాన 'ఖేల్ భారత్' క్రీడోత్సవాల్లో భాగంగా వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. కేయూ క్రీడా మైదానంలో కబడ్డీ, క్రికెట్ పోటీల ఫైనల్ మ్యాచ్‌ను వీసీ గురువారం ప్రారంభించి మాట్లాడారు. ఏబీవీపీ కేయూ ఇన్‌చార్జ్ నిమ్మల రాజేష్, అధ్యక్షుడు సాయికుమార్, సెక్రటరీ శివకుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పూజ, బాధ్యులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

హన్మకొండ చౌరస్తా: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని డాక్టర్ రమేష్ సూచించారు. రోడ్డ భద్రత మాసోత్సవాల్లో భాగంగా హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో కుడా ఆఫీసు నుంచి బస్టాండ్ జంక్షన్ వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. డాక్టర్లు రాధిక, సుధాకర్, అశోక్, చంద్రమోహన్, చందునాయక్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో పెండింగ్‌లో విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించనున్న బీసీ విద్యార్థి సమర శంఖారావం సభకు కేయూ గేట్ నుంచి పలు వాహనాల్లో గురువారం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా జెండా ఊపి వాహనాలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరెగంటి నాగరాజు, బాధ్యులు తుపాకుల తరుణ్, రవితేజ, భీమన్న, సాయి, రాజ్‌కుమార్, సాయి, శివ, నగేష్ పాల్గొన్నారు.

వరంగల్‌ను సినిమా పరిశ్రమ కేంద్రంగా ప్రకటించాలి

రామన్నపేట: వరంగల్ జిల్లాను సినిమా పరిశ్రమ కేంద్రంగా ప్రకటించాలని సంగీత సాహిత్య నృత్య నాటక రంగాల కళాకారుల ఐక్యవేదిక నాయకులు డిమాండ్‌చేశారు. ఈమేరకు పోచమ్మమైదాన్‌లో నిర్వహించిన కళాకారుల ఐక్యవేదిక సమావేశంలో ప్రతినిధులు మాట్లాడుతూ ఫిబ్రవరి 9వ తేదీన మన రాష్ట్రం - మన సినిమా, జిల్లా కేంద్రంగా సినీ పరిశ్రమ ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో సదస్సు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సుధాకర్, మురళీధర్ దేశ్‌పాండే, నజీర్ అహ్మద్, శ్యామల గణేష్ పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ పాఠశాలలో స్వయం పాలనా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయుల వేషధారణలో సహ విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శాంతారాం కరణ్, ఉప ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌లో సీసీ కెమెరాలు వద్దు

విద్యారణ్యపురి: ఫిబ్రవరి 3నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షల సందర్భంగా పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చాలనే ఇంటర్ బోర్డు నిబంధనను ఉపసంహరించుకోవాలని హనుమకొండలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలల యజమాన్యాలు కోరాయి. ఈమేరకు డీఐఈఓ గోపాల్‌కు ఆయా కళాశాలల యజమానులు గురువారం వినతిపత్రం సమర్పించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం భట్టుపల్లి గ్రామంలో రోటరీ క్లబ్ ఆఫ్ హనుమకొండ, హెల్త్‌ప్లస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన వచ్చిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ ప్రభాకర్, రోటరీ క్లబ్ సభ్యులు, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లా ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్, సీడ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ముఖ్య నాయకులు.. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈమేరకు హనుమకొండలోని తన స్వగృహంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి మురళి గురువారం ఆహ్వానించారు.

బీఆర్ఎస్‌లో చేరిక

హన్మకొండ / వరంగల్: వర్ధన్నపేట నియోజకవర్గం 14వ డివిజన్ ఏనుమాముల గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. ఈమేరకు హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో వారికి కండువాలు కప్పి పార్టీలోకి బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుందర్శన్‌రెడ్డి, నన్నపునేని నరేందర్ గురువారం ఆహ్వానించారు.

కార్మికులు వివక్షకు గురవుతున్నారు

హసన్‌పర్తి: మున్సిపల్‌లో పనిచేస్తున్న కార్మికులు వివక్షకు గురవుతున్నారని సీఐటీయూ గ్రేటర్ మున్సిపల్ అధ్యక్షుడు బరుపటి మహేష్ ఆవేదన వ్యక్తం చేశారు. మెజారిటీ కార్మికులు దళిత వర్గానికి చెందిన వారని అన్నారు. గురువారం జరిగిన మున్సిపల్ యూనియన్ హసన్‌పర్తి ఏరియా కమిటీ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉప్పలయ్య, మున్సిపల్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్, కార్యదర్శి బాబు పాల్గొన్నారు.

నేడు బీసీ హక్కుల సాధన సమితి సమావేశం

ఖిలా వరంగల్: జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని బీసీ హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింద కుమారస్వామి కోరారు. ఈనెల 31న నగరంలో జరగనున్న బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు వివరించారు.

2, 3వ తేదీల్లో బొడ్రాయి వేడుకలు

ఖిలా వరంగల్: వరంగల్ కరీమాబాద్ రోడ్డులో ఫిబ్రవరి 2, 3వ తేదీల్లో గ్రామ దేవత బొడ్రాయి ప్రథమ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ అధ్యక్షుడు వాగిలిశెట్టి అనిల్‌కుమార్ తెలిపారు.